



మంత్రివర్గ విస్తరణలో మరోసారి మొండిచేయి



- ఈదఫా కూడా ఉమ్మడి జిల్లా నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు
- మలివిడత క్యాబినెట్‌లో సామాజిక సమీకరణాల వల్ల దక్కనిచోటు
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి వస్తుందని ఆశించిన జిల్లా నేతలు
- సుదర్శన్‌రెడ్డి ఇంటికి వెళ్లి పరిస్థితిని వివరించిన రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, పీసీసీ చీఫ్
- ఉమ్మడి జిల్లాకు మంత్రి లేకపోవడం వల్ల అభివృద్ధి పనులపై పడుతున్న ప్రభావం

నిజామాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు కాంగ్రెస్ అధిష్ఠానం మరోమారు మొండి చేయి చూపింది. ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి వస్తుందని ఎదురు చూసిన నేతలకు మాత్రం నిరాశే మిగిలింది. మొదటి నుంచి రాజకీయ చైతన్యానికి ప్రాతినిధ్యంగా ఉన్న ఉమ్మడి జిల్లాకు అన్ని ప్రభుత్వాల హయాంలో మంత్రి పదవి ఇచ్చినా.. ప్రస్తుతం మాత్రం అవకాశం రాలేదు. ఉమ్మడి జిల్లా నుంచే రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. సామాజిక సమీకరణాల వల్ల అవకాశం దక్కలేదు. మొదటి నుంచి రాష్ట్ర క్యాబినెట్‌లో తనకు అవకాశం వస్తుందని ఎదురు చూసిన బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రికి ఈ దఫా కూడా నిరాశే మిగిలింది. సామాజిక సమీకరణాల్లో ఆయనకు అవకాశం రాకపోవడంతో అనుచరులు తీవ్ర నిరాశకు గురికాగా.. అధిష్ఠానం మాత్రం బుజ్జగించే చర్యలను చేపట్టింది. హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి రాష్ట్ర ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఇతర నేతలు వెళ్లారు. ఆయనను బుజ్జగించడంతో పాటు అధిష్ఠానం నిర్ణయాన్ని వివరించారు. ఇంకా మూడు బెర్తులు ఖాళీగా ఉండటం వల్ల మూడో విడతలో అవకాశం ఉంటుందని వివరించినట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు కాంగ్రెస్‌కు ఎమ్మెల్యేలు

రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పుతున్న నేతలు ఉన్నా.. జిల్లాకు మాత్రం మంత్రి పదవి దక్కలేదు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం ఏర్పడగానే జిల్లాకు మంత్రి పదవి వస్తుందని భావించారు. ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్‌కు నలుగురు ఎమ్మెల్యేలు ఎన్నిక కావడం వల్ల తప్పనిసరిగా క్యాబినెట్‌లో అవకాశం వస్తుందని అంచనా వేశారు. మొదటి విడతలో సీఎం కాకుండా 11 మందిని మంత్రులుగా నియమించిన అవకాశం మాత్రం రాలేదు. అప్పుడు ఉన్న సామాజిక సమీకరణాల వల్ల అవకాశం ఇవ్వలేదని అధిష్ఠానం వివరించింది. ఎమ్మెల్యేలకు సర్దిచెప్పింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి పలువురు నేతలకు పదవులను కట్టబెట్టింది. రాష్ట్రస్థాయిలో సలహాదారులుగా షబ్బీర్ అలీ, మధ్యలో చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అవకాశం కల్పించింది. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లుగా ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, కాసుల బాల్‌రాజులకు అవకాశం ఇచ్చింది. సీనియర్ నేత గడుగు గంగాధర్‌కు రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యులుగా నియమించారు. జిల్లా నుంచే పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియమితుల య్యారు. ఆయనకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. రాష్ట్ర రాజకీయాలతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలో ఆయన ప్రస్తుతం దృష్టిపెట్టి పనిచేస్తున్నారు. తదనంతరం జరిగిన పరిణామాల తో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దిల్ రాజుకు అవకాశం ఇచ్చారు. మిగతా నేతలకు ఉమ్మ డి జిల్లా పరిధిలో నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించారు.

అభివృద్ధి పథకాల అమలులో మంత్రుల పాత్ర కీలకం

ఉమ్మడి జిల్లాను సమీక్షించడంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పథకాలు అమలు అయ్యేందుకు మంత్రి పదవి కీలకం. మొదటి నుంచి ఉమ్మడి జిల్లా నుంచి బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి అవకాశం వస్తుందని అందరూ అంచనా వేశారు. మొదటి విడతలో అవకాశం రాక పోవడంతో రెండోదఫా తప్పనిసరిగా అవకాశం వస్తుందని భావించారు. సీఎం రేవంత్‌రెడ్డికి దగ్గరగా ఉండటం ఆయన కూడా పట్టుబట్టడంతో ఈ దఫా ఖాయంగా మంత్రి పదవి వస్తుందని ఉమ్మడి జిల్లా నేతలు భావించారు. అయితే పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం వల్ల రెండోదఫా కూడా అవకాశం రాలేదు. మలివిడత విస్తరణలో సామాజిక సమీకరణాల బట్టి ఎస్సీల నుంచి ఇద్దరు, బీసీల నుంచి ఒకరికి రాష్ట్రస్థాయిలో అవకాశం కల్పించారు. మరో మూడు మంత్రి పదవులను భర్తీ చేయలేదు. వాటిని కూడా కొన్ని రోజుల్లో భర్తీ చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ఉన్న సమీకరణాల ఆధారంగా వాటిని భర్తీ చేసే అవకాశం ఉంది. ఈ దఫా ఉమ్మడి జిల్లా నుంచి తప్పనిసరిగా మంత్రి పదవి సుదర్శన్‌రెడ్డికి వస్తుందని ఉమ్మడి జిల్లా నేతలు అంచనా వేశారు. మంత్రి పదవి వస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అన్ని రకాలుగా ఉపయోగం ఉంటుందని భావించారు. ఈ సారి కూడా జిల్లాకు అవకాశం రాలేదు. మొదటి నుంచి ఉమ్మడి జిల్లాతో పాటు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలో చాలా కార్యక్రమాలను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. పార్టీ ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఎంపికతో పాటు ఇతర వ్యవహారాలను ఆయన పర్యవేక్షించారు. పూర్తిస్థాయిలో పనిచేశారు. పదేళ్ల పార్టీ అధికారంలో లేని సమయంలో కీలకంగా వ్యవహరించారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా పార్టీ మారకుండా ఉండటంతో పాటు పార్టీ క్యాడర్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేశారు. పార్టీ రాష్ట్ర కోశాధికారిగా ఉండటంతో పాటు క్యాడర్ నిలబడే విధంగా చూశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించే విధంగా పర్యవేక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డికి దగ్గరగా ఉండటం పార్టీ శ్రేణులకు కూడా అందుబాటులో ఉండటం వల్ల మలివిడతలో అవకాశం వస్తుందని అంచనా వేశారు. రాష్ట్ర మంత్రివర్గ రెండో విడతలో అవకాశం రాకపోవడంతో ఆయన నారాజుగా ఉన్నా రని తెలుసుకున్న అధిష్ఠానం కూడా నష్టనివారణ చర్యలు చేపట్టింది. ఆయనను బుజ్జగించేందుకు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ఆదివారం వెళ్లి మాట్లాడారు. రాష్ట్రస్థాయి లో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు కట్టుబడి ఉంటానని వారికి వివరించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడం వల్ల ఉమ్మడి జిల్లా శ్రేణులు మాత్రం నిరాశలో ఉన్నారు.

నియోజకవర్గాలకే ఎమ్మెల్యేలు పరిమితం

ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి లేకపోవడం వల్ల ఆ ప్రభావం ఇతర పనులపై కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులను సమీక్షించేందుకు మంత్రి లేరు. ఎమ్మెల్యేలు ఉన్నా నియోజకవర్గాలకే పరిమితం కావడం వల్ల పూర్తిస్థాయిలో సమీక్షించే పరిస్థితి కనిపించడం లేదు. కొన్ని పథకాలు సక్రమంగా అమలు కావడం లేదు.

మిగతా 8వ పేజీలో...



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఇంటికో ఛత్రపతి శివాజీ తయారు కావాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

మోపాల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికొక ఛత్రపతి శివాజీ తయారు కావాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఇందూరు నగరం ఇందూరు సామ్రాజ్య దినోత్సవం సందర్భం గా శివాజీ మహరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో బోర్గాం(పి) చౌర స్తాలో ఏర్పాటు చేసిన శివాజీ మహరాజ్ విగ్రహా ఆవిష్కరణ మహో త్సవ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ పట్టాభిషేకులైన రోజు హిందూ సామ్రాజ్య దినోత్సవం రోజున బోర్గాం(పి)లో శివాజీ విగ్రహం ఆవిష్కరణ జరుపుకోవడం శుభపరిణామం అన్నారు. లవ్ జిహాద్ పేరిట జరుగుతున్న అన్యాయాలను ప్రతిఘటించడానికి ప్రతి ఇంట్లో ఒకరు ఛత్రపతి శివాజీ తయారు కావాలన్నారు. శివాజిని గొప్ప వీరునిగ తీర్చిదిద్దిన తల్లి జిజి యా బాయి నేటి మహిళలకు ఆదర్శం అన్నారు. గోవధను హిందువులు అంతా ఒక్కటై ఎదుర్కోవాలని అన్నారు. హిందూ మందిరాలపై రోజు రోజుకూ దాడులు పెరుగుతున్నా.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓ వర్గానికి కొమ్ముకాస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో శివాజీ మహరాజ్ సేవా సమితి ఇందూరు జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి రవి, కోశాధికారి జగన్, ఉపాధ్యక్షులు దుర్గాప్రసాద్, రాజేశ్వర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శివాజీ స్ఫూర్తిగా పిల్లల్ని పెంచాలి

● విద్యాభారతి దక్షిణ భారత కార్యదర్శి లక్ష్మణ్‌రావు



ఘోష్ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

నిజామాబాద్ కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నేటితరం పిల్లలకు శివాజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని తల్లిదండ్రులు పిల్లలను పెంచాల్సిన బాధ్యత ఉందని విద్యాభారతి దక్షిణ భారత కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందూరు నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ సామ్రాజ్య దినోత్సవానికి ఆయన ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులు, ఆచార్యుల యొక్క మార్గదర్శంలో ప్రతి యుగంలో మహనీయుడు ఉద్భవించారని ఆచార్యుల యొక్క ధర్మమార్గాన్ని అనుసరించి ధర్మ సంస్థాపన చేశారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ ఠాకూర్ సందీప్‌సింగ్ మాట్లాడుతూ.. 1925లో నాగ్‌పూర్ నగరంలో కేవలం 6 మందితో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ నేడు ఖండాంతరాలు దాటి ప్రపంచంలోని సవిశాలమైన సామాజిక సంస్థగా ఎదగడం వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ ఈ ఉత్సాహంతో మరో వంద సంవత్సరాలు ఉత్సాహంగా కోట్లాది మంది కార్యకర్తలతో పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బోర్గాం వద్ద నూతనంగా ఆవిష్కరించిన శివాజీ విగ్రహం వద్ద స్వయం సేవకులు ఘోష్ ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ అర్గుల సత్యం, సహకార్యవాహులు సుమిత్‌కుమార్, వెంకటేశ్, శివాజీ సేవాసమితి అధ్యక్షులు లక్ష్మణ్‌రావు, కోశాధికారి గజానంద్, వినేష్‌రెడ్డి, స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మృగశిర కార్తె

- చేపలు, మామిడిపండ్లకు పెరిగిన గిరాకీ
- పలుచోట్ల చేప మందు పంపిణీ..



7

నిజాంసాగర్ కెనాల్‌లో పేరుకుపోయిన చెత్త

● పూడిక తీయించని అధికారులు



8

ప్రణాళిక లోపం.. పర్యావరణానికి శాపం!

- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- విద్యుత్ తీగల కింద నాటిన హరితహారం మొక్కలు
- మొక్కలు పెరిగి విద్యుత్ తీగలకు తగులుతున్నాయని చెట్లను నరికి వేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు
- వేలకోట్లు ఖర్చుచేసి గత ప్రభుత్వం అవెన్యూ ప్లాంటేషన్
- ఉపాధి కూలీలతో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు

7



మళ్లీ కరోనా నేపథ్యంలో వైద్య శాఖ అప్రమత్తం

● జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు

నిజామాబాద్ అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ కరోనా క్రమంగా వ్యాప్తి చెందుతుండడం, శని వారం జిల్లాలో తొలి కరోనా పాజిటివ్ కేసు నమోదు కావడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. కరోనా మళ్లీ వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలను చేపడుతున్నారు. ఏఏ ఆసుపత్రులలో ఎన్ని పడకలు ఉన్నాయో అధికారులు వివరాలు సేకరి స్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు కరోనా పరీక్షలు చేసేలా సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతా నికి కరోనా పాజిటివ్ కేసుల ప్రభావం పెద్దగా లేకపోయినప్పటికీ ముందు ముందు ఎక్కువగా కేసులు నమోదైతే ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయంలో వైద్య శాఖ అప్రమత్తమైంది. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలోని 7వ అంతస్తులో ఇప్పటికే ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. కరోనా టెస్టులు చేసే కిట్‌లను కూడా అందుబాటులోకి తీసుకువస్తు న్నారు. అనుమానం వచ్చిన వారికి తప్ప నిసరిగా పరీక్షలు చేసేలా ఏర్పాట్లు చేస్తు న్నారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసు ప్రతిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. ఎప్పటిక ప్పుడు వైద్యులు, సిబ్బంది, ఆక్సీజన్, ఇతర మందులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో ఎలుగుబంటి మృతి

ఇందల్వాయి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎలుగుబంటి మృతి చెందిన ఘటన ఇందల్వాయి మండ లంలో జరిగింది. మండలంలోని తిర్మన్‌పల్లి అటవీ శివారు ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి ఎలుగుబంటి రోడ్డు దాటుతుండగా నిజామాబాద్ నుంచి కామారెడ్డి వెళ్తున్న గుర్తుతెలియని వాహ నం ఢీకొట్టడంతో మూడు సంవత్సరాల మగ ఎలుగుబంటి అక్కడికక్కడే మృతి చెందింది. ఎలుగుబంటి కళేబరాన్ని తిర్మన్‌పల్లి సెంట్రల్ నర్సరీలో పోస్టు మార్టం చేసి దహన సంస్కారాలు చేశా మని ఫారెస్టు రేంజ్ అధికారి రవిమో హన్‌భట్ ఆదివారం తెలిపారు. పంచనా మాలో డీఎఫ్‌వో వికాస్‌మీనా, ఎఫ్ఆర్‌వో రవిమోహన్‌భట్, వెటర్నరి డాక్టర్ గంగా ప్రసాద్, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్

పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి

● పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్

మోపాల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని బాడ్సి సింగం పల్లి గ్రామాలకు చెందిన 18 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు వివిధ రోగాలతో ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరిగే విధంగా కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి అండగా నిలవాలన్నారు. అర్హులైన పేదల కు ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గత పాలకుల స్వార్థం కోసం పనిచే శారే తప్ప.. పేదల కోసం చేసిన అభివృద్ధి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బాడ్సి సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, గ్రామ ఉపసర్పంచ్ రవి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి, గంగారాం, దాసు, వంశీ, తదితరులు ఉన్నారు.

అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ వరం



మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈడబ్ల్యూఎస్ రిజర్వే షన్ అగ్రవర్ణ పేదలకు వరం లాంటిదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని గుజరాతీ భవన్‌లో సీతారాంనగర్, ఆనంద్‌నగర్ ఆర్యవైశ్య హౌజ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులాని కొక కార్పొరేషన్ పెట్టి కాంగ్రెస్ నాయకులకు చైర్మన్ పదవులు ఇచ్చి ఉపాధి కల్పించారు తప్పితే అభివృద్ధి శూన్యం అని ఎద్దేవా చేశారు. వైశ్య కార్పొరేషన్‌కు అభివృద్ధి కేటాయించిన నిధులు శూన్యం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వా నికి ఆర్యవైశ్యులపై ఉన్న కపటప్రేమకు నిదర్శనం అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యు లు రాజకీయాలకు అతీతంగా ఒక్కటి కావాల న్నారు. అసోసియేషన్ వివిధ సంఘాల కార్యవ ర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకో వాలని విజ్ఞప్తి చేశా రు. ఈ కార్యక్రమంలో కట్కం చిరంజీవి, మురి కి రాజేందర్, పబ్బరాజు, శ్రీనివాస్, సత్యనా రాయణ, ధన్‌పాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాగంటి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఎమ్మెల్యే మాగంటికి జిల్లా ప్రజాప్రతినిధుల నివాళులు


సుభాష్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ పార్థివదేహాన్ని సందర్శించి ఎమ్మెల్సీ కవిత నివాళులర్పించారు. హైద రాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల నివాసం లో మాగంటి గోపినాథ్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, తదితరులు ఉన్నా రు. కాగా, ఎమ్మెల్యే మాగంటి మృతిపట్ల పలువురు జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మొదలైన వరినాట్లు


నిజామాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా పరిధిలో వరినాట్లు మొదల య్యాయి. నిజాంసాగర్ ఆయ కట్టు కింద రైతులు ఈ వరినా ట్లను వేస్తున్నారు. ప్రాజెక్టు నుం చి నీళ్లు విడుదల కాకున్నా ముం దస్తుగానే వరినాట్లను మొదలు పెట్టారు. స్థానికంగా దొరికే కూలీలతో పాటు బిహార్, ఉత్తర్ ప్రదేశ్, ఒడిస్సా నుంచి వచ్చిన కూలీలతో ఈ నాట్లను వేస్తున్నా రు. ప్రతీ సంవత్సరం జూన్ ఆరంభంలోనే నాట్లను మొదలు పెట్టే రైతులు ఈ యేడాది కూడా ముందస్తుగానే ఈ వరినాట్లను వేస్తున్నారు. సన్నరకం వరి సాగును చేస్తున్నారు.



● వర్నిలో నాట్లు వేస్తున్న దృశ్యం



● మోస్రాలో నాట్లు వేస్తున్న దృశ్యం



కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

ఏర్గట్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టాపూర్ గ్రామానికి చెందిన పలువురు ఆదివారం బాల్కొండ నియోకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ముత్యాల సునీల్ కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో చేపడుతున్న అభివృద్ధిపనులు, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, సయ్యద్ షేక్‌షా, బూక్య నందు, షేక్ కరీం, గోలి కైలాస్, ఇమామ్, నజీర్, తిరుపతి, గొల్కొండ మల్లేష్, నరేందర్, కిషన్‌లు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఏర్గట్ల మాజీ సర్పంచ్ పిట్ల మీణ మృతి



ఏర్గట్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాజీసర్పంచ్ పిట్ల మీణ ఆదివారం రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. వివరాల్లోకి వెళితే మోర్తాడ్ నుంచి ఏర్గట్లకు తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుడంగా ఏర్గట్ల శివారుల్లో ద్విచక్ర వాహనంపై కూర్చున్న మీణ అదుపు తప్పి కింద పడటంతో తలకి తీవ్రంగా దెబ్బ తగలడంతో ఆర్మూర్‌లోని ఓ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మాధ్యలోనే మృతిచెందారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

జాన్కంపేట్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, జూన్8 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో ఆదివారం మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. నిరుపేదలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందినవారికి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం పేదలకు వరంగా మారిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్ అన్నారు. సీఎంఆర్ఎఫ్ మంజూరుకు కృషిచేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్‌కుమార్, రాష్ట్ర విత్తనాభివృద్ధి చైర్మన్ అన్వేష్‌రెడ్డిలకు కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జేమ్స్ గంగారెడ్డి, నర్సింహారెడ్డి, సౌడ శ్రీనివాస్, కిశోర్‌గౌడ్, వినోద్, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలపాలి'



బుస్సాపూర్ లో తీర్మానం చేస్తున్న బీజేపీ నాయకులు

మెండోర, జూన్8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను ప్రజలకు తెలుపాలని బీజేపీ మండల అధ్యక్షుడు మార ముత్యంరెడ్డి అన్నారు. మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో మెండోర మండల బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు మార ముత్యంరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ పదకొండేళ్ల నరేంద్రమోదీ సుపరిపాలనలో జరిగిన ప్రగతిని ప్రజలకు వివరించాలని, రాష్ట్రంలో కాం గ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రబారి గంగసాయన్న, సీనియర్ నాయకులు నడ్పి సాయన్న, జనరల్ సెక్రటరీ రాజేష్, మహేందర్, సతీష్, ప్రసాద్, పురు షోత్తం, నాగేందర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబసభ్యులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



అంత్యక్రియలో పాల్గొన్న నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే

జక్రాన్‌పల్లి, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని సికింద్రాపూర్ గ్రామంలో మాజీఎంపీపీ కుంచాల విమలరాజు, తల్లి రాజవ్వ అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం జరిగిన రాజవ్వ అంతక్రియల్లో నిజామాబాద్‌రూరల్ మాజీఎమ్మెల్యే, మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజీరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు. కుంచాల విమల రాజు కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపి ధైర్యాన్ని కల్పించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి మాజీ ఎంపీపీలు లక్ష్మీనర్సయ్య, డికొండ హరిత శ్రీనివాస్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బోజన్న, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, మాజీసర్పంచ్‌లు భాస్కర్ రెడ్డి, దేవరాజ్ ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

కోటగిరి,జూన్8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని బడిబాటలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కోటగిరి మండల కేంద్రంలోని మాలివాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మాలివాడ కాలనీలో బడిబాట బయట ఉన్న పిల్లలను గుర్తించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, దుస్తులు, పుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ప్రధానోపాధ్యాయులు సాయిలు, గంగారాజు పాల్గొన్నారు.



కోటగిరిలో బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామాల్లో మృగశిరకార్తె సందడి



కమ్మర్‌పల్లిలో చేపలు కొనుగోలు చేస్తున్న జనాలు



బోధన్ చేపల మార్కెట్లో కొనుగోళ్ల సందడి

కమ్మర్‌పల్లి, జూన్ 8.(ఆంధ్రజ్యోతి) రోహిణి కారెల్తో ఎండలు తగ్గుముఖం పట్టడంతో వాతావరణం కాస్త చల్లబడడం, ఆదివారం నుంచి మృగశిరకర్తె ప్రవేశించడంతో మండలంలోని గ్రామాల్లో మృగశిరకార్తె సందడి మొదలయింది. ఈ కార్తె సందర్భంగా తప్పకుండా చేపలు తినాలని ప్రజల్లో గట్టి నమ్మకం ఉండడంతో కర్తె మొదటిరోజు ఆదివారం గ్రామాల్లో చేపలు కొనడానికి ప్రజలు బారులు తీరారు. మృగశిరకార్తెను గ్రామాల్లో మిరుగు కార్తెగా పిలుస్తారు, మిరుగు కార్తె రోజు చేపలు తింటె ఉబ్బసం, గుండెజబ్బులు, అస్తమా వంటి రోగాలు రావని పూర్వీకులు ఈ అనవాయితిని కొనసాగిస్తువస్తున్నారు. మండంలోని గంగపుత్రులు శనివారం రోజే వివిధ చెరువుల నుంచి పెద్దసంఖ్య చేపలు పట్టి తెచ్చి నిలువ ఉంచగా ఆదివారం ఉదయం నుంచే చేపలు కొనుగోలు చేయడానికి జనాలు బారులు తీరారు. మృగశిరకార్తె కావడంతో విక్రయదారులు చేపల ధరలను చేపల రకాలను బట్టి కిలో చేపలు 2వందల నుండి 3వందలు 5 వందల వరకు విక్రయించారు. అలాగే మృగశిర కార్తె రోజు చేపలతో పాటు కోడిమంసాన్ని సైతం తినాలన్న ఆనవాయితి ప్రకారం పెద్ద సంఖ్యలో చేపలు, కోడిమంసాన్ని బారులు తీరి కొనుగోలు చేశారు. ఈ సారి ఉదయం నుంచి సాయంత్ర వరకు చేపల విక్రయాలు జరగాయి. కాగా కొన్ని గ్రామాల్లో గంగపుత్రులు చెరువుల వద్ద కూడ సాయంత్రం వరకు చేపల విక్రయాలు సాగించారు.

జోరుగా చేపల అమ్మకం

మెండోర : మృగశిర కార్తె మిరుగు రోజును పురస్కరించుకొని ఆదివారం మండలంలో చేపల అమ్మకాలు జోరుగా సాగాయి. ఈ సందర్భంగా ప్రతి ఏడాది మిరుగు రోజు చేపల కూరవండుకోవడం గ్రామాల్లో ఆనవాయితీగా వస్తోంది. దీంతో మత్స్యకారులు గ్రామ ఊర చెరువుల్లో చేపలను పట్టి విక్రయాలు జరిపారు. మెండోర, కోడిచర్ల, బుస్సాపూర్, సావెల్, వెల్కటూర్, దూదిగాం, చాకిర్యాల్, పోచంపాడ్ గ్రామాల్లో ప్రజలు చేపలను భారీగా కొనుగోలు చేశారు.

కోటగిరి : ఉమ్మడి మండలంలో ఆదివారం మృగశిర కార్తెను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వర్షాకాలానికి నాంది పలికే మృగశిర కార్తెలో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. పదిరోజులుగా వేసవి తాపంలో ఇబ్బందులు పడ్డ రైతులకు మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురు గాలులతో కూడిన తొలకరి వర్షం రైతులను పలకరించింది. మరోవైపు మృగశిర కార్తె రోజున చేపలు తినడం ఆనవాయితీ కావడంతో పలు గ్రామాలలో చేపలవిక్రయ కేంద్రాలు వెలిశాయి. మార్కెట్‌లో చేపల ధరలు అమాంతం పెరిగాయి. ధర పెరిగినా చేపలు కొనేందుకు పోటీ పడ్డారు.

పెరిగిన డిమాండ్

బోధన్‌రూరల్ : మృగశిర కార్తె పండుగ సందర్భంగా బోధన్‌లో చేపల విక్రయాలు జోరందుకున్నాయి. మృగశిర కార్తె ఆదివారం రావడంతో ప్రజలు చేపలు తినడానికి ఆసక్తి కనబర్చారు. పట్టణ శివారులోని బెల్లాల్ చెరువు వద్ద, మండలంలోని అమ్దాపూర్ చెరువు వద్ద, సాలూర, బోధన్ మండలాల్లోని ఆయా చెరవుల వద్ద చేపలు పట్టేవారి వద్దకు ప్రజలు వెళ్లి చేపలు కొనుగోలు చేశారు. బోధన్ పట్టణంలో శక్కర్‌నగర్ చౌరస్తా, ఆచన్‌పల్లి చౌరస్తా, సాత్‌పుట్, బోధన్ చేపల మార్కెట్‌లలో చేపల కొనుగోలుదారులతో చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. 100రూపాయలకు కిలో ఉన్న చేపలు 160నుంచి 180వరకు పెంచి వ్యాపారస్థులు చేపలను విక్రయించారు. మృగశిర కార్తె సందర్భంగా చేపల కొనుగోళ్లకు బాగా డిమాండ్ ఏర్పడింది.

ముప్కాల్‌లో కిక్కిరిసిన మార్కెట్

ముప్కాల్ : మృగశిర కార్తె పురస్కరించుకొని ప్రజలు చేపల మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేశారు. మృగశిర కార్తెతో వానకాలం మొదలవుతుందని చేపలు తినాలనే పూర్వం నుంచి వస్తున్న ఆనవాయితీ. కార్తె ఆరంభం అయితుందంటే వేసవికాలం నుంచి వానకాలంలోకి అడుగుపెట్టినట్లే భావిస్తారు. కార్తె తొలిరాజు చేపలు తింటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ప్రజల నమ్మకం. మృగశిర కార్తె పురస్కరించుకొని ప్రజలు గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

జోరుగా చేపల విక్రయాలు

డొంకేశ్వర్ : మృగశిర కార్తె పురస్కరించుకొని ఆదివారం చేపలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో డొంకేశ్వర్ మండలంలోని అన్నారం, నడ్కుడ, సిర్పూర్ గ్రామాల్లో చెరువుల వద్ద మత్స్యకారులు అధికంగా చేపల వేటను కొనసాగించారు. ఆయా గ్రామాల్లో చేపల మార్కెట్ వద్ద ప్రజలు గుమికూడారు. ఉదయం నుంచి చేపల మార్కెట్‌లు సందడిగా మారాయి. మరికొందరు నేరుగా చెరువల వద్దకే వెళ్లి చేపలను కొనుగోలు చేశారు. మృగశిర కార్తె రోజు చేపలను తినడం సాంప్రదాయంగా వస్తుంది. గ్రామాల్లో కూడా చేపలకు ధర పెరిగి కిలో 150 నుంచి 200 వరకు వాటి బరువును బట్టి విక్రయించారు.

జక్రాన్‌పల్లిలో ఘనంగా మృగశిర కార్తె

జక్రాన్‌పల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం మృగశిర కార్తెను ప్రజలు భక్తిశ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మృగశిర కార్తె సందర్భంగా చేపలు కొనుగోలు చేసేందుకు ప్రజలు మార్కెట్‌వద్ద ప్రజల సందడి నెలకొంది. ఈ కార్తెరోజు ఆనవాయితిగా ప్రజలు చేపలు కొనుగోలు చేస్తారు. గత ఏడాది గ్రామాల చెరువులు అలుగులు పారడంతో చెరువులలో చేపలు అలుగుల నుంచి వెళ్లిపోయాయి. దీంతో గ్రామాలలో చేపలకొరత ఏర్పడింది.

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలలో మృగశిర కార్తె వేడుకలు ఘనంగా నిర్వహించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించిన పంటల సాగుకు రైతులు సమాయత్తం అయ్యారు. మృగశిరకార్తెను పురస్కరించుకుని నవీపేట చేపల మార్కెట్‌లో చేపలకు డిమాండ్ భారీగా ఏర్పడింది. ప్రతి రోజు కిలో రవ్వాట చేప 140రూపాయల వరకు విక్రయించగా పండుగను పురస్కరించుకుని వ్యాపారులు కిలో రవ్వాట చేపను 200 రూపాయల వరకు విక్రయించారు. అయినప్పటికీ పండగను పుస్కరించుకుని ప్రజలు అధిక ధరను సైతం చెల్లించి చేపలను కొనుగోలు చేశారు.



మెండోరలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



డొంకేశ్వర్‌లో చేపలు విక్రయిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆర్మూర్‌లో సమావేశమైన పూర్వవిద్యార్థులు

ఆర్మూర్ రూరల్, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని బాలుర జిలాల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1966-67 బ్యాచ్ (హయ్యర్ సెకండరి స్కూల్) విద్యార్థులు 58 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం జరిపారు. వారంతా వివిధ శాఖలలో ఉద్యోగాలు చేసి రిటైర్డ్ అయ్యారు. వివిధ ప్రాంతాలలో ఉన్నప్పటికీ అందరిని కలుసుకోవాలన్న కోరికతో యాభైఎనిమిదేళ్ల తర్వాత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అప్పటి గురువు రాజయ్యగుప్త హాజరయ్యారు. తమ బ్యాచ్ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు చేసి వివిధ పట్టణాలలో స్థిరపడినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా చిట్ల పార్థసారది (రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి), మోహన్‌రావు, రాజేశ్వర్, మధుసుదన్‌లకు బాధ్యతలు అప్పగించి పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించడమే కాకుండా ప్రస్తుత విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా పనిచేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, శ్రీ. రాజేశ్వర్, బి. శంకర్, మీసాల మోహన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మధుసుదన్, ప్రస్తుత హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

యంచలో ఢీ కొన్న బైక్‌లు

● ముగ్గురికి తీవ్ర గాయాలు



యంచ బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

నవీపేట, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ రోడ్డు బ్రిడ్జి సమీపంలో ఆదివారం సాయంత్రం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఫకీరాబాద్‌కు చెందిన రాథోడ్ విజయ్ మృగశిర కార్తెను పురస్కరించుకుని బాసరలో మామిడి పండ్లను విక్రయించడానికి వెళ్లాడు. అతడు ప్రతిరోజు కూరగాయలు, దోసకాయలు వంటివి విక్రయిస్తాడు. అతని వెంట అదే గ్రామానికి చెందిన రాథోడ్ రాజు వెంట వెళ్లాడు. సాయంత్రం బాసర నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా యంచ బ్రిడ్జి సమీపంలో ఎదురుగా మరో బైక్ రాగా ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బాసరవైపు వెళ్తున్న వ్యక్తి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన వ్యక్తిగా స్థానికులు భావిస్తున్నారు. బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఏఎస్ఐ మోహన్ రెడ్డిని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

తండ్రీకొడుకుల ఆత్మహత్యాయత్నం

● తండ్రి మృతి, కొడుకు పరిస్థితి విషమం

మాక్లూర్ , జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మానిక్‌బండార్ గ్రామానికి చెందిన ఆకుల సాయిలు (74), అతడి చిన్న కుమారుడు ఆకుల సతీష్ ఆదివారం తెల్లవారుజామున గులికల మందు తాగారు. సాయిలు మృతిచెందగా సతీష్ పరిస్థితి విషమంగా ఉందని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆకుల సతీష్‌కు గతంలో మూడు వివాహాలు జరిగి విడాకులు అయ్యాయి. ప్రస్తుతం తండ్రి కుమారుడు కలిసి ఉంటున్నారు. జనవరి నెలలో సతీష్‌కు పక్షవాతం రాగా తండ్రి అతడి బాగోగులు చూసుకునేవాడు. కొడుకుకు సేవ చేయడం భారం కాగా, అంతేకాక ఆసుపత్రిలో చికిత్స చేయించడానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెంది ఇద్దరు కలిసి పురుగుల మందు తాగారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా తండ్రి మరణించగా కుమారుడు సతీష్ పరిస్థితి విషమంగా ఉందని ఎస్సై తెలిపారు. పెద్ద కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థి మృతి..

మాక్లూర్ : నిర్మల్ జిల్లా నర్సాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్ రెండు రోజుల క్రితం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడు శివకుమార్ నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో రెండోసంవత్సరం చదువుతున్నాడు. సెకండ్ సెమిస్టర్‌లో రెండు సబ్జెక్టులు, మూడోసెమిస్టర్‌లో రెండు సబ్జెక్టులు, నాల్గో సెమిస్టర్‌లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. ఈ విషయంపై మంచిగా చదువుకొమ్మని కుటుంబసభ్యులు మందలించారు. వారం క్రితం సప్లమెంటరీ పరీక్షలు రాయడానికి నిజామాబాద్ వచ్చి ఆరోతేదీ మధ్యాహ్నం తానుంటున్న హాస్టల్ నుంచి దాస్‌నగర్ గ్రామశివారులో గడ్డిమందు తాగి తిరుగి హాస్టల్ వెళ్లాడు. అక్కడ వాంతులు చేసుకోగా అతడి స్నేహితులు గమనించి ఆసుపత్రిలో తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య'



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

డొంకేశ్వర్ , జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని డొంకేశ్వర్ ఎంఈవో రామకృష్ణ అన్నారు. మండలంలోని నూత్‌పల్లి గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో అందించే సౌకర్యాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు అనుభవం కలిగి ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు పురుషోత్తం రెడ్డి, సురేఖ, సాయిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయాలి



కోటగిరిలో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి

కోటగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం శ్రీ నలంద పాఠశాలలో తలపెట్టిన సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో గ్రామశాఖ సమావేశాలు నిర్వహించి ప్రజాసమస్యలు తెలుసుకున్నామన్నారు. మండల మహాసభలో చర్చించి ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర్, సాయిలు, గోపి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌లో దొంగతనం

ఆర్మూర్ టౌన్, జూన్8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంత్‌రోడ్డులో సాయిచైతన్య సూపర్ మార్కెట్‌లో దొంగ శనివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డాడు. దొంగ ఇనుప రాడుతో సూపర్ మార్కెట్ షటర్ తాళాలను పగులగొట్టి షాపులోకి చొరబడి కొన్ని వస్తువులతో పాటు సుమారు 80 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిసింది.

ఆలయంలో పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న దృశ్యం

ఆర్మూర్ టౌన్, జూన్8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్ రామాలయంలో ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పేరుకుపోయిన చెత్తచెదారంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రతీ ఆదివారం గంట స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తు ఆలయాలను శుభ్రపరుస్తున్నట్లు స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గంగామోహన్ చక్రు, గుద్దెటి రమేష్, రామాలయ అధ్యక్షుడు కొక్కుల లింగం, స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు బోడమీది ప్రశాంత్, నిశాంత్, రాజ్‌కుమార్, మధుసుదన్, ఎల్లయ్య, బోజన్న, ఆదిత్య, గణేష్, పెద్ద గంగారాం, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు మండల అధ్యక్షుడికి సన్మానం



మాలమహానాడు అధ్యక్షుడిని సన్మానిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

ఆలూర్, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల మహానాడు అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన అగ్గు క్రాంతికి బీఆర్ఎస్ పార్టీ ఆర్మూర్ నియో జకవర్గ ఇంచార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం సన్మానించారు. నూతన అధ్యక్షుడి నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువజన అధ్యక్షుడు పృథ్వీరాజ్, రోహిత్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



హాస్టల్ వార్డెన్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

ఆలూర్, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం మిర్ధాపల్లిలో సోషల్‌వెల్ఫైర్ హాస్టల్ వార్డెన్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు సౌడ సురేష్‌ను గ్రామ యువకులు ఆదివారం సన్మానించారు. మిర్ధాపల్లి గ్రామానికి చెందిన సౌడ సురేష్ ఇటీవల జరిగిన టీఎన్‌జీవో సోషల్ వెల్ఫైర్ హాస్టల్ వార్డెన్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నిక కావడంతో ఆయనను సన్మానించారు. గ్రామ యువకులు, పదోతరగతి బ్యాచ్ స్నేహితులు భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాదెపల్లి మధు, కల్లెం ప్రవీణ్‌రెడ్డి, మారపల్లి సాయిరెడ్డి, నవీన్, రవి, షాదుల్లా, సౌడ ప్రదీప్ పాల్గొన్నారు.

నేడు మహంతం, నాడాపూర్‌లలో రెవెన్యూ సదస్సులు

నవీపేట,జూన్8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతం, నాడాపూర్‌లలో సోమవారం భూభారతి కొత్త చట్టంకు సంబంధించిన రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వెంకట రమణ తెలిపారు. రైతులు తమ భూ సమస్యల వివరాలతో అధికారులకు దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

వర్నిలో మల్టీకేర్ ఆసుపత్రి ప్రారంభం

వర్ని,జూన్8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఇఫాన్ దేవ్ మల్టీకేర్ ఆసుపత్రిని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు ప్రారంభించారు. కార్యక్రమానికి డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ దత్తు వైద్యసేవలపై వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, వైస్ చైర్మన్ గోపాల్, విండో చైర్మన్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.


చేపమందు కోసం క్యూలైన్‌లో నిలబడ్డ ప్రజలు


చేపమందు వేస్తున్న దృశ్యం



ఘనంగా మృగశిర కార్తె

నిజామాబాద్ కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభానికి సూచికగా మృగశిరకార్తెను ఆదివారం జిల్లా అంతటా ఘనంగా జరుపుకున్నారు. నైరుతి రుతు పవనాలు మృగశిర కార్తె సమయానికి వ్యాపించి వర్షాలు కురుస్తాయని రైతన్నలు భావిస్తారు. ఈ రోజు నుంచి మొదలుకొని జేష్ట పౌర్ణమి వరకు పొలం పనుల్లో నిమగ్నం కావడం ఆనవాయితీగా వస్తుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని రైతులు తమ తమ పొలాల్లో పొలం పనులను ప్రారంభించారు. వాతావరణంలో వచ్చే మార్పులకు నాటి నుంచి పంచాంగం ప్రకారం రైతన్నలు ముందుకు సాగుతూ ఉంటారు. మృగశిర కార్తె రోజున ప్రారంభించే వ్యవసాయ పనులు ఆరుద్ర కార్తె వరకు ఊపందుకుంటాయి. దీంతో రైతన్నలు ఈ కార్తెను అనుసరించి పొలంలో జరిగే నాట్లు వేయడం, మందు చల్లడం, కలుపుమొక్కలు తీసివేయడం వాటిని పాటిస్తూ ఉంటారు. జిల్లా వ్యాప్తంగా మృగశిర కార్తెను పురస్కరించుకొని రైతన్నలు ఘనంగా జరుపుకోవడంతో గ్రామాలు మొదలుకొని మండ లాలు సందడిగా మారాయి.

చేపలు, మామిడిపండ్లకు పెరిగిన గిరాకీ...

మృగశిర కార్తె అనగానే చేపలు, మామిడిపండ్లు గుర్తుకు వస్తాయి. ఈ రోజున చేపలు తినడం వల్ల రానున్న రోజుల్లో రుతు సంబంధమైనటువంటి వ్యాధులు రావని భావిస్తారు. దీంతో మృగశిర కార్తె రోజు చేపలు తినడానికి మక్కువ చూపిస్తారు. మృగశిర కార్తె సందర్భంగా మార్కెట్‌లో చేపలకు మంచి డిమాండ్ పెరిగింది. చేపలకు డిమాండ్ పెరగడంతో వ్యాపారులు అధిక ధరలకు విక్రయించారు. ఎండాకాలంలో ఎంతో ప్రీతికరంగా తీసుకునే మామిడిపండ్లకు సైతం డిమాండ్ పెరిగింది. మృగశిర కార్తె పర్వదినాన తప్పనిసరిగా మామిడి పండ్లను తీసు కుం టారు. రెండు

మామిడిపండ్ల సీజన్‌లో ఈ రోజు చివరి రోజైన మృగశిర పర్వదినాన మామిడిపండ్లను తీసుకోవడంతో డిమాం డ్ పెరిగింది. పలు ప్రాంతాల్లో ఈ రోజున ఇంగు, బెల్లం తిన డం ఆనవాయితీ గా పాటిస్తారు. ఇంగు, బెల్లం తిన్న వారికి రానున్న కాలంలో సీజన్ వ్యాధులు రావని భావిస్తారు.

ఉబ్బస వ్యాధితో బాధపడుతున్న వారికి చేప మందు పంపిణీ..

ఉబ్బస వ్యాధితో బాధపడుతున్న వారికి చేపమందు తినడం వల్ల తగ్గుతుందని వైద్యశాస్త్రం చెబుతుంది. దీంతో ప్రతియేటా మృగశిర కార్తె రోజున ఉబ్బస వ్యాధితో బాధపడుతున్నవారు చేపతో సహా మందును స్వీకరించడం ప్రత్యేకత. జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్‌తో పాటు పలు ప్రాంతాల్లో చేపమందు పంపిణీ చేశారు. మృగశిర కార్తె మధ్యాహ్నం ప్రవేశించడంతో ఉదయం నుండే చేపమందు అం దించే ప్రాంతాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో క్యూ లైన్‌లో నిలబడి మందును స్వీకరించారు.






చేపలు కొనుగోలు చేసేందుకు బారులు తీరిన జనం

ప్రణాళిక లోపం.. పర్యావరణానికి శాపం!

● నీరుగారుతోన్న ప్రభుత్వ లక్ష్యం


ముప్కాల్ రహదారిపై కోతకు గురైన చెట్లు

ముప్కాల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం వేలకోట్లు ఖర్చుచేసి అవెన్యూ ప్లాంటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ చూపి రహదారులకు ఇరువైపులా ఉపాధి హామీ కూలీలతో మొక్కలు నాటి వాటి పరిరక్షణకు సైతం పక్కాగా చేపట్టారు. మొక్కలు పెరిగి పెద్దవై ప్రయాణీకులకు నీడనిస్తున్న వేళ విద్యుత్ తీగల కింద పెద్దవైన చెట్లను విద్యుత్‌శాఖ అధికారులు నరికివేయడం ప్రయాణికులను కలిచివేస్తుంది. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలు పెరిగి పద్దవై రోడ్డువెంబడి ప చ్చదనంతో పాటు నీడను ఇస్తున్నాయి. ఇది కార్లు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారికి ఎంతో ఊరట నిస్తుంది. రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో హరితహారం పథకంలో భాగంగా నాటిన మొక్కలు పెరిగి పెద్దవైన చెట్లు గొడ్డలి వేటుకు నేల కూలు తుండడంతో పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించే హరితహారం నీరుగారు తుంది. ముప్కాల్ మండలంలోని పాత జాతీయ రహదారిపై ఇరువైపు ల నాటిన మొక్కలు, నల్లూర్ నుంచి వెంచిర్యాల్ వరకు పె ద్దవాగు రోడ్డుపై నాటిన మొక్కలు, కొత్తపల్లి నుంచి ము ప్కాల్ వెళ్లే రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలు విద్యుత్ తీగలకు తాగులుతున్నాయని గొడ్డలి వేటుకు కిందపడి పో యాయి. ఇష్టారీతిన ప్రణాళిక లేకుండా నాటడం సరి కాద ని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మొక్కలు నాటే సమయంలో చిత్తశుద్ధి కొరవడి విద్యుత్ లైన్ల కింద మొక్క లు నాటడం ఎంతవరకు శ్రేయస్కరమో అధికారు లకే తెలియాలి. ఆనాడే సరిగా మొక్కలు నాటివుంటే నరికి వేతకు గురై ఉండేవికావని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో హరితహారం పథకంలో భాగంగా చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ సారైనా నాటిన మొక్కలు కోల్పోకుండా జాగ్రత్తగా అన్ని విధాలుగా పరి శీలించాకే మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంబించాలని ప్ర జలు కోరుతున్నారు.

ఎల్లారెడ్డిలో పారిశుధ్యం అస్తవ్యస్తం

● మురికికాలువల్లో పేరుకు పోయిన చెత్తాచెదారం
● పలుచోట్ల వెలగని వీధి దీపాలు ● పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది


11 వ వార్డులో మురికికాలువను సొంతంగా శుభ్రపరుచుకుంటున్న కాలనీవాసులు


ప్రధాన రహదారి వెంట పారుతున్న మురికినీరు

ఎల్లారెడ్డిరూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మున్సిపల్ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో ఎటు చూసినా సమస్యలు పెరిగి పోతున్నాయి. 11వ వార్డు ఎస్సీ కాలనీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ దీపాలు వెలగడం లేదని, మున్సిపల్ కమిషనర్, వార్డు అధికారికి పలు మార్లు ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మురికి కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోయిందని గత 4,5 నెలల నుంచి శుభ్ర పరచడం లేదని దానికి తోడు ఇటీవల కురిసిన వర్షానికి మురికి కాలువల వెంబడి గడ్డి, కలుపుమొక్కలు పెరిగి పోవడంతో పాములు వస్తున్నాయని పేర్కొంటున్నారు. వివిధ వార్డులలో సైతం మురికి కాలువల్లో నీరు నిలిచి పోవడంతో దోమల బెడద ఎక్కువైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కౌన్సిలర్‌ల పదవి కాలం ముగియడంతో పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రజాప్రతినిధులు లేక పోవడంతో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక స్థానికులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారులలో చాలాచోట్ల విద్యుత్ దీ పాలు వెలగడం లేదని పలు వురు ఆరోపిస్తు న్నారు. మురికి కాలువలు సక్ర మంగా లేక ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచి పోతుంది. పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర హాస్పిటల్ సమీపంలో ప్రధాన రోడ్డుపైనే మురుగు నీరు పారుతున్న ఎవరు పట్టించుకోవడం లేదని స్థానికులు మం డిపడుతున్నారు. 2 వవార్డులో చినుకు పడితే చిత్తడిగా మారుతుందని మురికికాలువల్లో పారా ల్సిన నీరు ఇళ్లలోకి వస్తుందని కాలనీవాసులు మండిపడుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు రాక నామమత్రంగా హాజరవుతున్నారు. దీంతో పారిశుద్ధ్యం నిర్వహ ణ అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంటే వర్షాకాలంలో అనేక రోగాలు దరిచేరే ప్రమాదం ఉందనిఅధికారులు ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళిక ద్వారా పారిశుద్ధ్య పనులతో పాటు వీధిదీపాలు, పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాల్సిన అవసరం ఎంతైన ఉందని ప్రజల నుంచి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

పారిశుధ్య నిర్వహణ సరిగా లేదు
- బాలరాజ్, 11 వ వార్డు వాసి



మా కాలనీలో ఐదు నెలలనుంచి ము రికి కాలువలు శుభ్ర పరచక పోవడంతో చెత్త చెదారం పేరుకు పోతుంది. ప్రస్తుతం వర్షాలు పడడంతో గడ్డి ఏపుగా పెరిగి పాములు, దోమల బెడద్ద పెరిగిపోతుంది. మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదు.


తిప్పాపూర్ రైల్వేస్టేషన్






స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రైళ్ల రాకపోకల వివరాలు

తిప్పాపూర్ రైల్వే స్టేషన్‌లో టికెట్‌లు ఇచ్చేవారు కరువు

● తిప్పాపూర్ హాల్ట్ రైల్వేస్టేషన్‌లో విచిత్ర పరిస్థితి ● వేతనం సరిపోవడం లేదని టికెట్లు ఇవ్వడం మానేసిన కాంట్రాక్ట్ ఉద్యోగి
● టికెట్లు ఇవ్వకపోవడంతో ప్రయాణికులు టీసీలకు పట్టుబడుతున్న ప్రయాణికులు ● సమస్యను పరిష్కరించాలని ప్రయాణికుల వేడుకోలు

భిక్కనూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిలా తయారైంది భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ రైల్వే స్టేషన్ పరిస్థితి. ఈ గ్రామంలో 2005 సంవత్సరంలో రైల్వే శాఖ సహకారంతో గ్రామస్థులు వీడీసీ ఆధ్వర్యంలో గ్రామంలోని చిన్న,పెద్ద తేడా లేకుండా ఒక్కొక్కరికి రూ.25ల చొప్పున వసూళ్లు చేసి ఐకమత్యంతో స్వంతంగా తిప్పాపూర్ హాల్ట్ రైల్వేస్టేషన్‌ను నిర్మించుకుని అప్పటి ఎంపీ ఆలే నరేంద్ర, అప్పటి రాష్ట్రమంత్రి ప్రస్తుత ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, రైల్వే అధికారుల చేతుల మీదుగా ప్రారంభించుకున్నారు. తదనంతరం ఈ రైల్వేస్టేషన్ నిర్వహణను గ్రామ వీడీసీ ఆధ్వర్యంలో జరుగుతుంది. ఇందులో భాగంగా ఈ రైల్వే స్టేషన్‌లో టికెట్లు ఇవ్వడానికి గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని నియమించుకుని అతడికి టికెట్లపై వచ్చే కమీషన్‌తో పాటుగా మరికొంత నగదును వీడీసీ ఆధ్వర్యంలో ఇస్తువస్తున్నారు. ఈ రైల్వేస్టేషన్ తిప్పాపూర్ గ్రామస్థులతో పాటుగా చుట్టూ గ్రామాలు రామేశ్వర్‌పల్లి, మోటాట్‌పల్లి, ఆరేపల్లి, ఆరేపల్లి తండా, దంతేపల్లితో పాటుగా చుట్టూ గ్రామాల్లో ఉన్న ఫ్యాక్టరీల సిబ్బందితో కళకళలాడు తుంది. కానీ ప్రస్తుతం కమీషన్‌తో పాటుగా వీడీసీ ఇస్తున్న వేతనం సరిపోవడం లేదని గత మార్చి నెల నుంచి టికెట్లు ఇచ్చే వ్యక్తి టికెట్లు ఇవ్వడం మానేశాడు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ స్టేషన్‌లో రైల్లు ఆగుతున్నప్పటికీ టికెట్లు ఇచ్చే వారు లేకపోవడంతో టికెట్లు లేకుండానే రైలును ఎక్కడంతో టికెట్ కలెక్టర్‌లకు దొరికి జరిమానాలు చెల్లించవలసి వస్తుందని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● టికెట్లు ఇవ్వకపోవడంతో ప్రయాణికులు టీసీలకు పట్టుబడుతున్నవైనం

తిప్పాపూర్ రైల్వేస్టేషన్ నుంచి ప్రతీరోజు చాలామంది కార్మికులు, విద్యార్థులతో పాటుగా రైతులు, ఆయా ఫ్యాక్టరీలలో పనిచేసే ప్రయాణికులు రైలు ద్వారా వారి వారి గమ్యస్థానాలకు ప్రయాణిస్తుంటారు. కొంత కాలంగా స్టేషన్‌లో టికెట్లు, నెలవారి పాస్‌లు ఇచ్చే వారు లేకపోవడంతో టికెట్లు, పాస్‌లను వారు కొనుగోలు చేయలేకపోతు న్నారు. దీంతో చాలామంది టికెట్లు, పాస్‌లు లేక రైళ్లలో టీసీలకు పట్టుబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. టికెట్లు లేకపోవడంతో టీసీలకు ఎక్కడ పట్టుబడతామోనని బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తుందని, తిప్పాపూర్‌లో రైలు ఎక్కితే కామారెడ్డిలో కానీ, భిక్కనూరు, అక్కన్న పేట్‌లో కానీ రైలు దిగి టికెట్లను కొనుగోలు చేయాల్సి వస్తుందని, ఒక్కో సారి రైలు దిగి టికెట్లు కొనుగోలు చేసే సరికి రైలు ముందుకు సాగు తుందని తద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే తిప్పాపూర్ స్టేషన్‌లో టికెట్ కౌంటర్‌ను పునఃప్రారంభించాలని కోరుతున్నారు.

● ఈ స్టేషన్‌లో ప్రతీరోజు ఆగే రైళ్లు..

మండలంలోని తిప్పాపూర్ హాల్ట్ స్టేషన్‌లో ప్రతిరోజు దాదాపుగా ఎనిమిది నుంచి పది రైళ్లు ఆగు తుంటాయి. ఉదయం 7గంటల ప్రాంతంలో బోధన్-కాచిగూడ, 7:30గంటల ప్రాంతంలో కాచాగూడ-నాగర్ సోల్, 9గంటల ప్రాంతంలో కాచిగూడ- కరీంనగర్, నాందెడ్-మెడ్చల్, మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో కాచిగూడ- నిజామాబాద్, 3గంటల ప్రాంతంలో మేడ్చల్- నాందెడ్, సా యంత్రం 6గంటల ప్రాంతంలో నాగర్ సోల్- కాచిగూడ, 7గంటల ప్రాంతంలో నాగర్‌సోల్-కాచిగూడ, 8గంటల ప్రాంతంలో కరీంనగర్- కాచిగూడ రైల్లు ఆగుతుంటాయి.

● రైల్వేస్టేషన్‌లో సమస్యల తాండవం

ఈ హాల్ట్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లాలను మందుబాబులు రాత్రివేళల్లో ధ్వంసం చేయ్యగా ప్రయాణికులు కూర్చోడానికి ప్రస్తుతం కుర్చీలు లేవు. కనీసం తాగడానికి సైతం నీటి వసతి, మరుగుదోడ్ల వసతి లేదు. సిబ్బంది లేకపోవడంతో స్టేషన్ ఆవరణ అధ్వానంగా, పరిసరాలు చెట్లతో వనంలా తయారైంది. ప్రయాణికుల సౌకర్యార్థం వెంటనే టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేసి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయా లని ప్రయాణీకులు కోరుతున్నారు.

● సమస్యను పరిష్కరించుందుకు కృషిచేస్తున్నాం
- కొండ సిద్ధిరాములు, వీడీసీ చైర్మన్, తిప్పాపూర్.

తమగ్రామంలో అన్నివర్గాల ప్రజల సహకారంతో ఈ హాల్ట్ రైల్వే స్టేషన్‌ను నిర్మించుకున్నాం. ఈ స్టేషన్‌లో టికెట్లు ఇచ్చే వ్యక్తికి టికెట్లపై వచ్చే కమీషన్‌తో పాటుగా ప్రతినెలా వీడీసీ ఆధ్వర్యంలో రూ.3వేలను వేతనంగా ఇస్తున్నాం. కానీ కొన్ని రోజులుగా అతను వేతనం సరిపోవడం లేదని టికెట్లు ఇవ్వడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడంతో పాటుగా మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నాం. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుంది.

● వేతనం సరిపోవడం లేదు
- సదానందం, టికెట్‌లు ఇచ్చేవ్యక్తి తిప్పాపూర్

దాదాపుగా గత 15 సంవత్సరాలుగా ఈ స్టేషన్‌లో వీడీసీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న. ప్రతీరోజు దుమ్మాలు కొట్టకుండా ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉండాల్సి వస్తుంది. టికెట్లపై రూ.100కు కేవలం రూ.15ల కమీషన్ మాత్రమే రాగా వీడీసీ ఇదివరకు రూ.3 వేలు ప్రతినెలా ఇచ్చింది. ఈ వేతనం సరిపోకపోవడంతో కొన్ని రోజులుగా టికెట్లు ఇవ్వడం లేదు. వేతనం పెంచాలని వీడీసీ దృష్టికి తీసుకెళ్లా. సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నా.

సేంద్రియ పద్ధతిలో సాగుకు సర్కార్ చేయూత

● నేషనల్ మిషన్- నేషనల్ పార్మింగ్ పథకం అమలు
● సేంద్రీయ సాగు అమలుపై శిక్షణ
● ప్రోత్సాహకం కింద ఎకరాకు 4 వేలు అందజేత

పెద్దకొడప్‌గల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత తరుణంలో వ్యవసాయం రసాయన ఎరువులతో సాగు చేస్తుండగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని సేంద్రీయ పద్దతుల్లో చేపట్టేందుకు జాతీయ సహజ సేంద్రీయ సాగు పథకానికి శ్రీకారం చేపట్టింది. దీంతో రానున్న రోజుల్లో కామారెడ్డి జిల్లాలో సేంద్రియ వ్యవ సాయం చేసేందుకు గాను జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సేంద్రీయ వ్యవసాయం చేసే రైతులకు ప్రోత్సహించడంతో పాటు సేంద్రీయ ఎరువుల వినియోగం ద్వారా పంటలు పండించేందుకు ఈ విధానం ద్వారా చర్యలు చేపట్టనున్నారు. దీంతో పాటుగానే క్లస్టర్‌లను ఏర్పాటు చేసి రైతులకు సేంద్రీయ ఎరువుల తయారీ, విని యోగం పై శిక్షణనివ్వనున్నారు. ఇప్పటికే జిల్లాలో 15 క్లస్టర్లను ఎంపిక చేసిన అధికారులు 15 క్లస్టర్లలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో 125 మంది లబ్దిదారులను ఎంపిక చేసి 125 ఎకరాలలో సేంద్రియ పంటల సాగును చేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఇలా జిల్లాలో 15 క్లస్టర్లలో 1825 ఎకరాల్లో సేంద్రీయ సాగును అములు చేయనున్నారు.

జిల్లాలో క్లస్టర్లలోని గ్రామాల ఎంపిక..

కామారెడ్డి జిల్లాలో 15 క్లస్టర్లను ఎంపిక చేసిన వ్యవసాయాధికారులు ఇందుకు సంబంధించిన మా ర్గదర్శకాలు విడుదల చేశారు. బాన్సువాడ క్లస్టర్‌లో చిన్న రాంపూర్, భిక్కనూర్‌లో లక్ష్మీదేవునిపల్లి, బిచ్కుందలో సిరిసముందర్, దోమకొండలో సీతారాంపల్లి, గాంధారిలో సర్వాపూర్, జుక్కల్‌లో సావర్‌గాం, కామారెడ్డిలో క్యాసంపల్లి, లింగంపేట్‌లో జల్దిపల్లి, మాచారెడ్డిలో లక్ష్మీరావులపల్లి, మద్నూర్‌లో మద్నూర్, నాగిరెడ్డిపేట్‌లో మాల్తుమ్మెద, నిజాంసాగర్‌లో ఒడ్డెపల్లి, సదాశివనగర్‌లో లింగంపల్లి, తాడ్వాయిలో కరడ్‌పల్లి, ఎల్లారెడ్డిలో అన్నసాగర్ గ్రామాలను ఎంపిక చేశారు.

పథకం అమలు ఎన్‌జీవో విజన్‌కు అప్పగింత..

జిల్లాలో ఈ పథకం సమర్థవంతంగా అమలు చేసేందుకు గానే ప్రభుత్వం ఎన్‌జీవో విజన్ అనే సంస్థకు అప్పగించింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో నాలుగైదు క్లస్టర్లకు గాను లబ్దిదారులను ఒక చోటుకు చేర్చి శిక్షణ నిస్తారు. సేంద్రీయ ఎరువుల తయారీ, వాటి వినియోగం రైతులతో పాటు ఇతర రైతులకు ఈ విధానం తెలిసేలా చర్యలు చేపట్టనున్నారు. దీంతో పాటుగానే సేంద్రీయ ఎరువులు వాడిన తొలినాళ్ళలో పంట దిగుబడి తగ్గువ వస్తుందనే కారణంతో దానిని అధిగమించడానికి గాను సంవత్సరానికి ఎకరాకు రూ.4 వేల ఆర్థిక సహాయం అందించనున్నారు.



సేంద్రియ సాగుతో ఎంతో మేలు

పంటలను రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం ద్వారా పండిస్తున్న పంటలతో మానవాళికి విపరీతమైన నష్టం జరుగుతుంది. అంతే గాక రసాయన ఎరువులను వాడిన పంట ఉత్పత్తులను తినడం వలన క్యాన్సర్ వంటి రోగాల బారిన పడుతున్నారు. దీంతో పాటుగానే పర్యావరణం దెబ్బతింటుందని, నేల స్వభావం కోల్పోతుంది. ఈ నేపథ్యంలో భూసారాన్ని కాపాడటంతో పాటు మానవాళికి నష్టం జరగకుండ ఉండేందుకు గాను సేంద్రీయ సాగు అవసరం ఎంతైనా ఉందని పర్యావరణ ప్రేమికులు చెపుతున్నారు.

ఒక క్లస్టర్‌లో 125 ఎకరాల్లో సేంద్రియ సాగు
తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి



ఈ ఖరీఫ్ సీజన్ నుంచే జిల్లాలో సేంద్రీయ వ్యవసాయం సాగుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ఒక క్లస్టర్‌లో ప్రతి గ్రామం నుంచి రైతులతో పాటు మహిళా సంఘాల వారికి ప్రాధాన్యత నిచ్చి సేంద్రీయ ఎరువుల తయారీ, పంట మార్కెటింగ్ పద్ధతులపై శిక్షణనిస్తాం. దీంతో పాటుగానే సేంద్రీయ ఎరువులతో పంట సాగు చేసిన రైతులకు ఎకరాకు సంవత్సరానికి 4 వేల ప్రోత్సాహకం అందజేస్తాం.


సమావేశంలో మాట్లాడుతున్న వి.ప్రభాకర్

ఇంథనాల్ ఫ్యాక్టరీని వద్దన్న వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

సిరికొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంథనాల్ ఫ్యాక్టరీని వద్దన్న స్థానిక ప్రజలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సెక్రటేరియట్ సభ్యుడు ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలం గడ్కోల్ గ్రామంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గద్వాల జిల్లాలోని పెద్దదన్వాడ గ్రామంలో మాకు ఇంథనాల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయొద్దని ప్రజలు తిరగబడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా కేసులు నమోదు చేసి జైళ్లల్లో పెట్టడాన్ని తప్పుబట్టారు. ప్రజలకు అవసరమైన పరిశ్రమలను ఏర్పాటు చేయకుండా.. వద్దని కోరుతున్న పరిశ్రమకు అన్ని అనుమతులివ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇంథనాల్ పరిశ్రమ వద్దని అక్కడి ప్రజలు ఎన్నో రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రజలు తిరగబడుతున్నారని ఆయన అన్నారు. పరిశ్రమ వద్దని పోరాడిన వారిపై కేసులు పెట్టి జైళ్లకు పంపించడమేమిటని ప్రభాకర్ ప్రశ్నించారు. ఈ పరిశ్రమ ఏర్పాటయితే గాలీ, నీరు, కలుషితమై ప్రజలు జీవించలేని పరిస్థితి వస్తుందని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ప్రజల అభీష్టం మేరకు పరిశ్రమను ఏర్పాటు చేయడాన్ని మానుకోవాలని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రామకృష్ణ, జిల్లా నాయకులు రమేష్, రాజేశ్వర్, బి.కిషోర్, దామోదర్, సాయరెడ్డి, బాబన్న, లింబన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు దోస్త్ ప్రత్యేక కేటగిరి సర్టిఫికెట్ల పరిశీలన

డిచ్‌పల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని 2025-26 విద్యా సంవత్సరానికి దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి పీహెచ్‌సీ దివ్యాంగులు) సీఏపీ ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కర్యుకులర్ యాక్టివిటిస్ విద్యార్థులకు సోమవారం సర్టిఫికేట్‌ల పరిశీలన వర్సిటీలోని అడ్మిషన్ కార్యాలయంలో ఉంటుందని దోస్త్ కో ఆర్డినేటర్ వాసం చంద్రశేఖర్ తెలిపారు. ఈ విద్యార్థులు అన్ని సర్టిఫికేట్ లు రెండు జతల జిరాక్స్‌లు, ఒరిజినల్ లతో ఉదయం 10 గంటలకు నుంచి సాయంత్రం 5గంటల మధ్య హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

డిచ్‌పల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని యానంపల్లి రాంపూర్ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సతీశ్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంత రైతులు ఈ సదస్సులను సద్విని యోగం చేసుకోవాలని అన్నారు. ఫిర్యాదులు ఉంటే సదస్సులలో అధికారులకు వినతి పత్రాలు అందజేయాలని ఆయన కోరారు.

చేపల కోసం బారులు తీరిన జనం


ఐదు కిలోల చేపను పట్టుకెళ్తున్న గిరిజనులు

ధర్పల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె సందర్భంగా చేపల కోసం గ్రామస్థులు ఆదివారం పెద్ద సంఖ్యలో బారులు తీరారు. మృగశిర రోజున చేపలు తింటే ఆరోగ్యంగా ఉంటారని నమ్మకం. ఎండాకాలంలో ఎండవేడిని తట్టుకునే విధంగా వర్షాకాలంలో ప్రారంభమైన మృగశిర కార్తె రోజు చేపలు బుజిస్తే ఆరోగ్యంతో పాటు మంచి జరుగుతుందని గ్రామస్తుల విశ్వాసం. దీంతో చేపలు కొనేందుకు గ్రామస్తులు బారులు తీరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో చేపల కోసం ఎగబడ్డారు. రామడుగు ప్రాజెక్టుతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి చేపలను తరలించారు. ఇదే అదనుగా చేపలకు అధిక రేట్లు పెట్టడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఎలాగైనా చేపలు తీసుకోవడంతో అధిక రేట్లు ఉన్నప్పటికీ చేపలు కొనేందుకు ప్రజలు ఎగబడ్డారు.

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టపల్లి, మెంట్రాజ్‌పల్లి, ఖిల్లా డిచ్‌పల్లి, బర్ధిపూర్, గ్రామాల్లో మృగశిర కార్తె పురస్కరించుకొని చేపల కోసం ఆదివారం బారులు తీరారు. వర్షకాలంనకు ముందు మృగశిర కార్తె రోజు చేపలు తినలనే ఆనవాయితీని గ్రామీణ ప్రజలు కొనసాగిస్తున్నారు. అందులో భాగంగానే చేపల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడ్డారు. ఈ సందర్భంగా మత్స్యకార్మికులు అధికంగా విక్రయాలు కావడంతో ధరలు పెంచి విక్రయించారు. కొర్రమీను చేప కోసం ప్రజలు పోటీపడ్డారు.

నిజాంసాగర్ కెనాల్‌లో పేరుకుపోయిన చెత్త

- ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లు
- పూడిక తీయించని అధికారులు

ఆర్మూర్‌టౌన్ జూన్8: ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీ, జర్నలిస్టుకాలనీ, రంగచారినగర్, ఒడ్డెర కాలనీ వరకు నిజాంసాగర్‌కెనాల్‌లో చెత్త పేరుకుపోయి పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. రాబోయే వర్షాకాలంలో వరద నీటితో కెనాల్‌లో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయే ప్రమాదం ఉంది. నిజాంసాగర్ కెనాల్‌లో ఆర్మూర్ శివారులోని వడ్డెర కాలనీ ప్రాంతంలో తూతూ మంత్రంగా పూడిక తీస్తున్నారే తప్ప. పూర్తిగా అంకాపూర్ శివారు నుంచి ఆర్మూర్ పట్టణంలోని రంగచారి వరకు పూడికను తీయడం లేదు. దీంతో కెనాల్ కట్టపై ఇళ్లను నిర్మాణం చేసుకుని నివసిస్తున్న వారి ఇంటి డ్రైనేజీ నీరు కెనాల్‌లో పారుతోంది. దీనికి తోడు అట్టి కెనాల్‌లోనే చికెన్ సెంటర్ నిర్వాహకులు వ్యర్థాలను, చెత్తచెదారం పారివేయడంతో నీరు కలుషితమవుతోంది. 2023 ఏప్రిల్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పంటను దృష్టిలో ఉంచుకొని గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు, కుంటలు నింపడానికి నీటిని వదలగా జర్నలిస్టు కాలనీలో అర్ధరాత్రి నిజాంసాగర్ కెనాల్‌కు గండి పడడంతో లోతట్టు ప్రాంతంలో నివాసమున్న వారి ఇళ్లలో నీరుచేరింది. దీంతో నిత్యావసర సరుకులు సైతం నష్టపోయారు. విద్యుత్ సరఫరా సమయంలో ఒక విద్యుత్ స్తంభం పడిపోయింది. వెంటనే తేరుకున్న కాలనీవాసులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కానీ ఇప్పటి వరకు నిజాంసాగర్ కెనాల్‌లో పెరిగిన పిచ్చి మొక్కలను, ముళ్లపొదలను తీయకపోవడంతో కాలనీ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్నా ఇప్పటి వరకు ఇరిగేషన్ అధికారులు కెనాల్‌లో పేరుకుపోయిన చెత్త, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించకుండా చోద్యం చూస్తున్నారు. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిజాంసాగర్ కెనాల్‌ను శుభ్రపర్చాలని పలు కాలనీవాసులు కోరుతున్నారు.


కెనాల్‌లో పారుతున్న మురికి నీరు


కెనాల్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్త

రెండు శాఖలమధ్య సమన్వయ లోపం..

పట్టణంలోని మున్సిపల్, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయ లోపం కండ్లకు కట్టినట్లు కనబడుతుంది. నిజాంసాగర్ కెనాల్ కట్టపై కబ్జాచేసి ఇంటి నిర్మాణాలు, దుకాణాలు ఏర్పాటు చేసిన ఏ ఒక్క శాఖకూడా స్పందించలేదు. దీంతో ఆర్మూర్ శివారు నుంచి యానం గుట్ట శివారు వరకు కెనాల్ కట్టను కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ప్రతీ ఇంటి నుంచి డ్రైనేజీ పైప్‌లైన్ నిజాంసాగర్ కెనాల్‌లో వేయడం, దీనికి తోడు చెత్తచెదారాన్ని సైతం కెనాల్‌లో పారివేయడంతో పిచ్చిమొక్కలు, చెట్లు ఏపుగా పెరిగాయి. అక్రమంగా నిర్మించుకున్న నిర్మాణాలను మొదట్లోనే మున్సిపల్, ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. స్వచ్ఛమైన నీరు చెరువులకు, కుంటలకు చేరేది. అక్రమకట్టడాలపై మున్సిపల్ లో, ఇరిగేషన్ శాఖలో పలువురు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిజామాబాద్ అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాందేవ్‌వాడలోగల రావూజీ వంజరి సంఘం హైస్కూల్ 2005-06 10వ తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ గురువులను ఘనంగా సన్మానించారు. 20 సంవత్సరాల క్రితం చదువుకున్న స్నేహితులంతా ఒక్కచోట కలిసి ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో చాలా మంది హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాల్లో స్థిరపడగా కొంత మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొంది మరికొంత మంది ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చదువుకున్న సమయంలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులంతా తమ మంచి చెడులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రవి, సుజాత, శ్రీలత, సత్యం, తదితరులు పాల్గొన్నారు.


ఒక్కచోట చేరిన పదోతరగతి 2005-06 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో జిల్లాకు మరోసారి మొండిచేయి

(ఐదో పేజీ తరువాయి)

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉన్నా.. ఆయన తక్కువ సమయం కేటాయించడం వల్ల ఫలితం ఉండటం లేదు. ప్రభుత్వం పలు రకాల పనులను చేపడుతుంది. పలు పథకాలను అమలు చేస్తుంది. వీటన్నింటిని అమలు చేయడం సక్రమంగా లబ్దిదారులకు అందడం పూర్తిస్థాయిలో జరగడం లేదు. అధికారులతో వీటిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తేనే పనులు సజావుగా జరుగుతాయి. మంత్రి లేకపోవడం వల్ల కొన్ని పనులు సక్రమంగా జరగడం లేదు. ఇవేకాకుండా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేవారు లేరు. క్యాడర్‌కు అవసరమైన పనులు చేసేందుకు మంత్రి ఉంటే అవకాశం ఉంటుంది. వచ్చేది స్థానిక సంస్థల ఎన్నికలు. వీటిని సమీక్షించేందుకు పూర్తిస్థాయిలో నేతలు లేరు. ఎమ్మెల్యేలు ఉన్నా వారు ఐదు నియోజకవర్గాలకే పరిమితం అయ్యారు. మిగతా నియోజకవర్గాల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో క్యాడర్‌కు, నేతలకు దిశానిర్దేశం చేసి పనులను సమీక్షించేందుకు మంత్రి ఉంటే మేలు జరిగేది. రెండోవిడత కూడా ఇవ్వకపోవడం వల్ల నేతల్లో మాత్రం నిరాశ కనిపిస్తోంది.

ప్రమాదకరంగా కామక్క చెరువు తూము!

- మరమ్మతు కోసం తూం తవ్వారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు
- మూడు నెలలైనా పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

కోటగిరి,జూన్8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత రైతులకు సాగునీరు అందించే చెరువులు అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దాలుగా మారుతున్నాయి. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ప్రవేశపెట్టి చెరువు మరమ్మత్తు పనులు చేపట్టింది. చెరువుల సంరక్షణకై దృష్టి సారించాల్సిన ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో చెరువు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. కోటగిరి మండలంలోని లింగాపూర్ కామక్క చెరువు తూమును అధికారులు మూడు నెలల క్రితం తవ్వించారు. తూములో రాళ్లు తట్టుకోవడంతో వర్షకాలంలో సాగునీటికి ఇబ్బందులు లేకుండా తూమును తవ్వించారు. మూడు నెలలు అయిన అధికారులు మరమ్మత్తు పనులు చేపట్టలేదు. తూము ప్రాంతంలో పెద్ద గుంత ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి చెరువులోకి స్వల్పంగా నీరు చేరింది. తూము ప్రాంతంలో స్వల్పంగా నీరు వృథా అవుతుంది. చెరువు తూము మరమ్మత్తు కోసం తవ్విన గుంత రోజురోజుకు పూడుకుపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువు తూము వద్ద తవ్విన ప్రాంతం అంత తెగిపోయే ప్రమాదం నెలకొందని రైతులు తెలిపారు. కామక్క చెరువు కింద సుమారు 500ఎకరాల సాగుభూమి ఉంది. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. తవ్విన ప్రాంతంలో పైపులు వేసేలా అధికారులు చర్యలు చేపట్టే ప్రయత్నం చేసి చేతులు దులుపుకున్నారని రైతులు తెలిపారు. మరో వైపు కట్టపై ప్రయాణించాలంటే రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే సగానికి పైగా ధ్వంసం కాగా త్వరితగతిన చర్యలు చేపట్టకపోతే కట్ట పూర్తిగా తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి తూము మరమ్మత్తులు చేపట్టి గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.


తవ్వివదిలేసిన చెరువు తూము

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం..

: బాలాజీ పటేల్, రైతు

చెరువు తూము వద్ద ఏర్పడిన గండిని పూడ్చడంతో ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మూడు నెలల క్రితం తూములో రాళ్లు పేరుకుపోవడంతో ఆయకట్టుకు నీరు అందలేదు. ఇరిగేషన్ అధికారులు తూము మరమ్మత్తు చేపట్టేందుకు కట్టను తవ్వి వదిలేశారు. పైపులు తీసుకువచ్చిన వేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తెలిపారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు

సుభాష్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాల సందర్శన కోసం నిజామాబాద్, ధర్పల్లి నుంచి ఆర్టీసీ బస్సును ప్రవేశపెడుతున్నట్లు నిజామాబాద్ డిపో-1 మేనేజర్ ఆనంద్ తెలిపారు. ఈనెల 27 ఉదయం 5గంటలకు నిజామాబాద్ నుంచి బయలుదేరి ధర్పల్లి నుంచి కామారెడ్డి, సిద్దిపేట్ మీదుగా ఉదయం 9గంటలకు యాదగిరి గుట్టకు చేరుకుంటుందని యాదాద్రి సందర్శన అనంతరం అక్కడి నుంచి 12గంటలకు బయలుదేరి స్వర్ణగిరిని సందర్శించి అక్కడి నుంచి ముంచింతల్ రావడం జరుగుతుందని అన్నారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు బయలుదేరి అర్ధరాత్రికి చేరుకుంటుందని తెలిపారు. స్పెషల్ బస్సు కావున ఈ బస్సులలో మహాలక్ష్మి స్కీం వర్తించదని తెలిపారు. ఒక్కోక్కరికి చార్జి రూ.1400లు అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకునే వారు నిజామాబాద్ బస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో లేదా స్టేషన్ మేనేజర్ కానీ టిజిఆర్టీసీ.ఇన్‌ను సంప్రదించాలని కోరారు.

వివాహిత అదృశ్యం

సిరికొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన మున్నూరు శోభ అనే వివాహిత ఆదివారం తెల్లవారుజామున నుంచి కనిపించడం లేదని భర్త మున్నూరు మహిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి వరకు కుటుంబ సభ్యులందరం కలసిమెలిసి ఉన్నామని ఆదివారం తెల్లవారు జాము నుంచి కనిపించడం లేదని భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్ తెలిపారు.

బాలికల ఆత్మరక్షణకు కరాటే

- ఉచిత శిక్షణ.. ఆత్మరక్షణ

బోధన్ రూరల్, జూన్8 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మహిళలపై, బాలికలపై రోజురోజుకు పెరుగుతున్న అఘాయిత్యాలకు జరగకుండా ఉండాలంటే బాలికల ఆత్మరక్షణకై కరాటే ఎంతో అవసరం ఉంది. అనుకోకుండా ఏవైన సంఘటనలు జరిగినప్పుడు ఆత్మరక్షణకై కరాటే ఎంతో దోహదపడుతుంది. అందుకు నేటి సమాజంలో తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు ఆత్మ రక్షణకై కరాటే, ఇతర వ్యాయమ తదితర ఆత్మరక్షణకు శిక్షణ ఎంతో అవసరం ఉంటుంది కాబట్టి ఇటువంటి శిక్షణ నేర్పించాలి. బాలికలకు ఝాన్సీ లక్ష్మి బాయి, రాణి రుద్రమదేవి వంటి మహిళల ధైర్య సాహసాలను నూరిపోయాల్సిన అవసరం ఎంతైన ఉంది. బోధన్ పట్టణంలో ప్రతి రోజు కరాటే మాస్టర్ అశోక్ కుమార్ రోడే బాలికలకు ఉచితంగా కరాటే విద్యను శిక్షణ ఇస్తున్నారు. మహిళలకు ఉచిత శిక్షణ ఆత్మరక్షణ ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆత్మరక్షణ, ఏకాగ్రత ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. కరాటే నేర్చుకునేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న బాలికలపై అఘాయిత్యాలను అడ్డుకోవడానికి ఆత్మరక్షణ క్రీడాపోటీలు, వ్యాయమాలు ఎంతో అవసరం. తల్లిదండ్రులు బాలికలపై చిన్నచూపు చూడకుండా అన్ని విద్యలు నేర్పించాలి. మహిళలు ధైర్యంగా ఎదుర్కొనప్పుడే అఘాయిత్యాలను నివారించవచ్చు.


ఉచిత శిక్షణ సాధన చేస్తున్న చిన్నారులు

రోజూ నేర్చుకుంటున్నా: కవిత, రాకాసిపేట్

నేను 6వ తరగతి చదువుతున్నా. రోజు జూనియర్ కళాశాల ప్రాంగణానికి కరాటే నేర్చుకుంటున్నా. ఇక్కడ శిక్షణతో భవిష్యత్‌లో పూర్తిస్థాయిలో కరాటే నేర్చుకుంటా. కరాటే నేర్చుకోవడంతో ఆత్మస్థైర్యం పెరిగింది.

కరాటే అంటే ఇష్టం: రజిత, శక్కర్‌నగర్

నేను 5వ తరగతి చదువుతున్న, కరాటే అంటే ఇష్టం. రోజు కరాటే శిక్షణ శిబిరానికి వస్తున్న. కరాటే ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని తెలిసి ఉత్సాహంగా మెలకువలు నేర్చుకుంటున్నాను.



చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.110	రూ.190	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.120	రూ.200	రూ. 230

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.97,300	రూ.89,900	రూ.1050

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కరాటే కిడ్ లెజెండ్స్ (తెలుగు) (11.00)
: మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్) (1.15)
: భైరవం (4.45, 10.35)
: బూల్ చౌక్ మాఫ్ (హిందీ) (7.55)
స్క్రీన్-2 : హౌజ్‌ఫుల్-5 (హిందీ) (9.40, 3.40, 7.10, 10.40)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (1.10)
స్క్రీన్-3 : ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (11.30)
: బద్మాషులు (2.00)
: థగ్ లైఫ్ (4.35, 10.40): పాడేరు 12 మైలు (8.00)
స్క్రీన్-4 : మిషన్ 007 (11.05) : హౌజ్‌ఫుల్-5 (1.40)
: శ్రీశ్రీశ్రీ రాజావారు (5.10, 10.45)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (8.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : థగ్ లైఫ్ (1.25, 7.35, 10.40)
స్క్రీన్-2 : శ్రీశ్రీశ్రీ రాజావారు (10.30, 4.30, 10.33)
: భైరవం (1.30, 7.30)
స్క్రీన్-3 : హౌజ్‌ఫుల్-5 (హిందీ) (10.30, 1.25, 4.30, 7.35, 10.40)

లలితామహల్ : భైరవం (11.15, 2.15, 6.15, 9.15)
దేవి: శ్రీశ్రీశ్రీ రాజావారు (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : హౌజ్‌ఫుల్-5 (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : థగ్ లైఫ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్